క్లుప్తంగా

దశభుజ మహా గణపతికి పూజలు



పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనానికి స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

నీలగిరి స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నీలగిరిస్వామి

వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలో భక్తుల కొంగుబంగారం నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆల యంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకుపూజ, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు.

30 శాతం రాయితీతో కందుల పంపిణీ



మాట్లాడుతున్న ఏఓ మధుకర్

వజ్రకరూరు: 30శాతం రాయితీతో కందులను పంపిణీ చేయనున్నట్లు ఏఓ మధుకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్‌జీ 52 అనే రకం కందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. క్వింటా పూర్తి ధర రూ.13,980 కాగా 30 శాతం రాయితీ రూ.4,194 పోనూ రూ.9,786 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి రైతుకూ 8కిలోల కందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నాలుగు కిలోల బ్యాగు రూ.392తో ఇస్తున్నట్లు తెలిపారు. మండలానికి 200 క్వింటాళ్ల కందులు ప్రతిపాదనలు పంపగా, ఇప్పటి వరకు 100 క్వింటాళ్ల కందులు సరఫరా అయినట్లు తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఖరీఫ్ పంటల సాగులో రైతులు నిమగ్నం



వజ్రకరూరు మండలం గంజికుంట వద్ద కంది సాగు చేస్తున్న రైతులు

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖరీఫ్ పంటల సాగును రైతులు ప్రారంభించారు. ఇటీవల మండల వ్యాప్తంగా వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వ్యవసాయ పొలాలను చదును చేసుకుని పంటల సాగుకు సమాయత్తమయ్యారు. ఇప్పటికే అధికారులు రాయితీతో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వేరుశనగ పంటతోపాటు కంది, ఆముదం తదితర పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. తాజాగా ఆదివారం వజ్రకరూరు మండలంలోని వజ్రకరూరు, గంజికుంట, తట్ర క ల్లు గ్రామాల పరిసర ప్రాంతాల్లో కంది సాగు చేశారు.

పెరిగిన బీటీపీ నీటి మట్టం



నిండు కుండను తలపిస్తున్న భైరవానితిప్ప ప్రాజెక్టు

బ్రహ్మసముద్రం: కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు వేదావతి నదిలో ప్రవాహం పెరిగి బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట మండలాల మధ్య ఉన్న బీటీపీ ప్రాజెక్టులోకి చేరింది. దీంతో మే నెల 23 నాటికి ప్రాజెక్టు నీటి మట్టం డెడ్ స్టోరేజ్ 1,635 అడుగులు ఉండేది. జూన్ 23 నాటికి 1645. 2 అడుగులకు చేరింది. భైరవానితిప్ప ప్రాజెక్టులో నీరు చేరడంతో అటు రెండు మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆశలన్నీ ఆరుద్రపైనే

- రాలని చినుకులు.. సాగని ఖరీఫ్ పనులు
- జూన్‌లో వర్షాలు కురవకపోవడంతో రైతుల ఆందోళన
- అదనులో పదును అవుతుందని ఆశగా ఎదురుచూపు



విత్తన సాగుకు పొలాన్ని సిద్ధం చేసి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతు

రాయదుర్గం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అదునులో పదునైన వర్షాలు కురవాలి.. మృగశిర కార్తె ముగిసింది. ఈనెల 22న ఆరుద్ర కార్తె ఆరంభమైంది. ఈ కార్తెలో వర్షాలు కురుస్తాయని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. జూన్ 1 నుంచి జూలై 15 లోపు పంటల సాగుకు అనుకూలంగా ఉందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. మృగశిర కార్తెకంటే ముందే తొలకరి జల్లులు పలకరిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో అన్నదాతలు ఖరీఫ్ పంటల సాగుకు సర్వం సిద్ధమయ్యారు. తొలకరి జల్లులు రెండు రోజులపాటు మురిపించాయి. దీంతో అన్నదాతల్లో కలవరపాటు మొదలైంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సరైన వర్షాలు కురవని కారణంగా ఇప్పటి దాకా 10 శాతం కూడా సాగులోకి రాలేదు. మూడు నియోజకవర్గాల్లోనూ 2,90,473 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా, ఇందులో 2,44,517 హెక్టార్లలో ఖరీఫ్ పంటలు సాగులోకి వస్తాయి. అయితే ఇప్పటిదాకా కేవలం 13,014 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ, కంది, ఆముదం, పత్తి పంటలు సాగయ్యాయి. దీంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ఆరుద్ర కార్తె పైనే ఆశలు పెట్టుకోవాల్సి వచ్చింది. ఓవైపు విత్తనాలు ఎరువులు, సమకూర్చుకున్నారు. మరోవైపు విత్తన సాగుకు నేలను సాగు చేసి, ఎరువులు చల్లడం, దుక్కులు దున్నడం పూర్తి చేసుకున్నారు. ఇలాంటి సమయంలో వరుణుడు మొహం చాటేస్తుండడంతో అన్నదాతలు ఆకాశం వైపు చూస్తున్నారు. ఖరీఫ్ పనులు కాస్త మందగించాయి. ఆరుద్ర కార్తె అదునులో పదునైన కార్తె కావడంతో చినుకులు నేల రాలిందే తడవుగా చక చకా విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు.

జలాశయాల్లోకి ఆగిన వరద నీరు

కర్ణాటక రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు దిగువనున్న తుంగభద్ర (టీబీ) డ్యాంతో పాటు వేదావతి హగరిపై నిర్మితమైన బీటీ ప్రాజెక్టుకు కొన్నాళ్లు వరదనీరు పోటెత్తింది. అక్కడ కూడా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నీటి ఉధృతి క్రమంగా తగ్గిపోయింది. టీబీ డ్యాం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, శనివారం నాటికి 5.579 టీఎంసీల నీరు చేరాయి. ప్రస్తుతానికి 610 క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బీటీ ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 1,655 అడుగులు కాగా, 1,646 కు చేరువలో వరదనీరు వచ్చి చేరుకుంది. ఇక్కడ ఇన్‌ఫ్లో ఆగింది. ఈ ఖరీఫ్ లోనైనా అన్నదాతల సాగుకు వరుణదేవుడు అనుకూలించాలని ఆలయాల్లో రైతులు పూజలు చేస్తున్నారు.

జూలై 15 వరకు అనుకూలం

ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు ఇంకా సమయం ఉంది. వచ్చే నెల జూలై 15 వరకు రైతులు సాగుచేసుకోవచ్చు. ఆందోళన పడాల్సిన అవసరంలేదని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏడీఏలు లక్ష్మానాయక్, యల్లప్ప, పద్మజ సూచించారు. వర్షం ఎప్పుడు పడినా విత్తుకోవచ్చన్నారు. రైతుకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు ముందుగానే సమకూర్చామన్నారు. గడువు ఉండడంతో ఆందోళన అవసరం లేదన్నారు. ఈ కార్తె నుంచే పదును వర్షాలు కురుస్తాయన్నారు.

సాగు వివరాలు ఇలా..

నియోజకవర్గం	సాధారణ సాగు (హెక్టార్లు)	సాగు అంచనా (హెక్టార్లు)	ప్రస్తుత సాగు (హెక్టార్లు)
రాయదుర్గం	62,629	38,507	3,812
కళ్యాణదుర్గం	67,754	55,400	2,982
ఉరవకొండ	1,60,090	1,50,610	6,220

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కంబదూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ నిత్యానందబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో సంబంధిత అధికారులకు విన్నవించుకోవచ్చన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని తెలియజేశారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలి

రాయదుర్గంటౌన్: ప్రతి కార్యకర్త, నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు జింకా వసుంధర, పట్టణ అధ్యక్షుడు వడేకర్ అంభోజీరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ జరుపుకున్నారు. శ్యాంప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ శివశంకర్, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్, రవికుమార్, శివానంద, అంజి, పూజారి నాగరాజు, తిప్పేస్వామి, శేషు, నాగరాజు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం గ్రామ సమీపంలో ఆదివారం ఇసుక ట్రాక్టర్ పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను 74 ఉడేగోళం గ్రామానికి చెందిన సందీప్ ట్రాక్టర్‌లో రాయదుర్గం పట్టణానికి తరస్తుండడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

నాణ్యతలో మేటి..భారతి సిమెంట్



గోవిందవాడలో తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందిస్తున్న భారతి సిమెంట్ సిబ్బంది

బొమ్మనహాళ్: భారతి సిమెంట్ నాణ్యతలో మేటి అని సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మోతీలాల్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో బవరాజ్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో అందుబాటులో ఉన్న ఇతర సిమెంట్ ట్రేడ్‌లతో పోల్చుకుంటే భారతి సిమెంట్ మూడు రెట్లు నాణ్యతగా ఉంటుందని తెలిపారు. వినియోగదారులు భారతి సిమెంట్‌ను వాడేందుకు మొగ్గు చూపుతున్నారన్నారు. రోబోటెక్ క్వాలిటీ, జర్మనీ టెక్నాలజీ, టాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్ వంటి అత్యున్నత ప్రమాణాలతో భారతి సిమెంట్‌ను అందిస్తున్నామని తెలిపారు. తాపీ మేస్త్రీలకు రూ.లక్ష చొప్పున ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ సుబ్బరాయుడు, డీలర్లు రంగనాథ్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులకు బ్రేక్

కుందుర్పి: మండల వ్యాప్తంగా ఉపాధిహామీ పథకం పనులకు బ్రేక్ పడింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఆయా గ్రామాల్లో ప్రస్తుతం పని చేస్తున్న ఫీల్డ్ అసిసెంట్లను తొలగించి, టీడీపీ సానుభూతిపరులకు అవకాశం ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో తాత్కాలికంగా పనులను నిలిపివేసినట్లు మలయనూరు, అప్పిలేపల్లి,ఎగ్రగుంట,కరిగానిపల్లి తదితర పంచాయతీల్లోని కూలీలు తెలిపారు. టీడీపీ కార్యకర్తల్లోనూ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల కోసం పెద్ద సంఖ్యలో ఆశావహులు ముందుకు వస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై ఆ పార్టీ మండల స్థాయి నాయకులకు తలనొప్పిగా మారిందని చర్చ సాగుతోంది.

బస్ షెల్టర్ పైకప్పు ఏర్పాటు చేయండి



కమ్మూరు వద్ద బస్‌షెల్టర్ పైకప్పునకు రేకులు లేని దృశ్యం

కూడేరు: మండల పరిధిలోని కమ్మూరు వద్ద అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ పైకప్పు రేకులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రహదారి నిర్మాణం సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. అయితే పైకప్పు లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు, వానకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కోడ్ ముగిసినా తొలగని ముసుగు



కూడేరు తహసీల్దార్ కార్యాలయానికి ఏర్పాటు చేసిన శిలాఫలకానికి తొలగని ముసుగు

కూడేరు: సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యాయి. ఫలితాలు వెలువడ్డాయి. ఎన్నికల కోడ్ ముగిసింది. అయినా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలకు ముసుగు తొలగించలేదు. తహసీల్దార్ కార్యాలయం, మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలకు ఏర్పాటు చేసిన శిలాఫలకాలకు పేపర్లతో ముసుగు కప్పారు. వాటిని తొలగించకుండా అలాగే వదిలేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



అలంకరణలో దర్శనమిస్తున్న ఎర్రితాతస్వామి

బెళుగుప్ప: మండల కేంద్రంలోని శాంతిధామంలో ఆదివారం సద్గురువు అవధూత ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఎర్రితాతస్వామి 88వ ఆరాధనోత్సవాల్లో భాగంగా కళశపూజ, గణపతి, నాందీ పూజలతో వేదపండితులు ప్రారంభించారు. ఆధ్యాత్మికతను బోధిస్తూ, బెళుగుప్పలో ఎనిమిదిన్నర దశాబ్దాల క్రితం అవధూత ఎర్రితాత జీవ సమాధి అయ్యారు. దీంతో భక్తులు ఎర్రితాత సమాధిని గంగపూజతో శుద్ధిచేసి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సోమవారం ఆలయంలో ఎర్రితాత సమాధికి మహాక్షీరాభిషేకం, బిల్వార్చన, పల్లకీసేవ, పాదుకాభిషేకం, శేషతల్ప అలంకరణలు, రాత్రికి పురవీధుల గుండా స్వామివారి ప్రభోత్సవం, మంగళవారం చత్రప్రభ అలంకరణ, ఉట్లపరుష, కోలాటం ఉంటాయన్నారు.

గొర్రెలు,మేకలకు ఈటీ వ్యాక్సిన్



గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి

కుందుర్పి: వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు ఈటీ వ్యాధి ప్రబలే అవకాశం ఉందని రైతులు ముందస్తుగా వ్యాక్సిన్ వేయించాలని పశు వైద్యాధికారి ప్రసాద్ సూచించారు. మండలంలో రెండు రోజులుగా తమ సిబ్బంది గొర్రెలు, మేకలకు చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈటీ వ్యాక్సిన్ కొరత ఉన్నందున ప్రభుత్వానికి ఇండెంట్ పంపామన్నారు. రెండు మూడు రోజుల్లో గొర్రెల రైతులకు నేరుగా వ్యాక్సిన్ అందిస్తామన్నారు. కుందుర్పి, మలయనూరు, బెస్తరపల్లి, జంబుగుంపల, ఎర్రగుంట తదితర గ్రామాలకు చెందిన రైతులు నట్టల నివారణ మందు, గడ్డి విత్తనాలు సరఫరా చేయాలని రైతులు పశువైద్య అధికారులను కోరారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై మితిమీరుతున్న టీడీపీ దౌర్జన్యాలు

కళ్యాణదుర్గం రూరల్: నియోజకవర్గంలో దళితులపై టీడీపీ దౌర్జన్యాలు మితిమీరుతున్నాయని దళిత జన జాగృత అధ్యక్షుడు ఆర్‌కే రాజు అన్నారు. మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అగ్రకులాల వారి ఆధిపత్యం పెరిగిపోయిందన్నారు. నారాయణపురం పంచాయతీలో రెండు రేషన్‌షాప్‌లు ఉన్నాయన్నారు. అందులో ఒకటి ఎస్సీలకు కేటాయించాలని కోరగా, దీన్ని టీడీపీకి చెందిన అగ్రకులాల నాయకులు వ్యతిరేకించారన్నారు. ఎస్సీలకు డీలర్‌షిప్ ఇస్తే, తాము వారి ఇంటికెళ్లి రేషన్ తీసుకోవాలా?, .. రెండు రేషన్ డీలర్‌షిప్‌లు అగ్రకులాలకే కేటాయించాలని నిర్ణయించడం సరైంది కాదన్నారు.

'రేపటి మైదానం' కృతి స్వీకర్తగా రాచపాలెం

అనంతపురం కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాలెం చంద్రశేఖర రెడ్డికి మరో గౌరవం దక్కింది. ప్రఖ్యాత కవి డాక్టర్ ఎన్.గోపి రచించిన 'రేపటి మైదానం' కావ్యం కృతి స్వీకర్తగా ఆచార్య రాచపాలెంను ఎంపిక చేశారు. కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ వారి ఆధ్వర్యంలో ఆచార్య గోపి అమృతోత్సవ వేడుకలు ఈనెల 25న హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరుగుతాయి.

లారీ దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన లారీ

విడపనకల్లు: మండల పరిధిలోని 67వ జాతీయ రహదారిలో హంచనహాళ్ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో లారీ దగ్ధమైంది. ఆదివారం తెల్లవారుజామున గుంతకల్లు నుంచి బళ్ళారి వైపు వెళ్తున్న లారీ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఒక్కసారిగా లారీలో నుంచి మంటలు చెలరేగాయి. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గుంతకల్లు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు. అప్పటికే లారీ ఎనభై శాతం కాలిపోయింది.

సేంద్రియ ఎరువులపై రైతుల ఆసక్తి



రాచేపల్లిలో పొలాలకు ట్రాక్టర్లో తరలిస్తున్న సేంద్రియ ఎరువు

ఉరవకొండ: పంటల సాగులో పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధించేందుకు రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల అనేక దుష్పరిణామాలు కలుగుతాయి. అంతేకాక ధరలు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. సాగు ఖర్చులు పెరిగి మెట్ట ప్రాంత రైతులు ఎకరా వరి పంటకు డీఏపీ, యూరియా, జింకు వంటి ఎరువులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీనికి తోడు నకిలీ మందులు కూడా వస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు దిగుబడులు పెంచుకునేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈక్రమంలో సేంద్రియ వ్యవసాయ ద్వారా కలిగే లాభాలపై రైతులకు అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. దీంతో చాలా మంది రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించడానికి ఆసక్తి చూపుతున్నారు. పేడ ఎరువుతో పాటు మేకలు, గొర్రెల ఎరువును ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇందుకోసం బీడు భూముల్లో గొర్రెల మందలు పెట్టించి, వాటి ఎరువులను వినియోగించుకుంటున్నారు. ఒకరోజుకు మంద పెట్టడానికి రూ.700 నుంచి రూ.1000 వరకు తీసుకుంటున్నారు. పలువురు రైతులు కళ్లంలో సేంద్రియ ఎరువుల దిబ్బలను పెట్టుకొని, ట్రాక్టర్లతో వాటిని పొలాలకు తరలిస్తున్నారు.

అన్ని విధాలా శ్రేయస్కరం



సేంద్రియ ఎరువుల వాడకం అన్ని విధాలా శ్రేయస్కరం. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించొచ్చు. రసాయన ఎరువులతో భూసారం తగ్గుతుంది. దీంతో భూమి బీడుగా మారే అవకాశం ఉంది. సాగుకు అయ్యే పెట్టుబడి కుడా ఎక్కువే. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమి సారవంతమవుతుంది. ఈవిషయంపై రైతులకు పొలంబడి ద్వారా అవగాహన కల్పించాం.

– శుభకర్, ఏఓ, ఉరవకొండ

'రెడ్డి వివాహ పరిచయ కార్యక్రమం' నిర్వహణకు చర్యలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ పాపంపేటలోని కార్యాలయంలో ఆదివారం రాయలసీమ రెడ్డి జన సంఘం కమిటీ సమావేశం జరిగింది. ప్రతి నెలా రెండో ఆదివారం 'రెడ్డి వివాహ పరిచయ కార్యక్రమం' నిర్వహించేలా తీర్మానించారు. ఈ కార్యక్రమాన్ని రెడ్డి కులస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రొద్దం సురేష్‌రెడ్డి, కార్యదర్శి దుబ్బ కిషోర్‌రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, సభ్యులు మంత్రి విశ్వనాథ్ రెడ్డి, ముచ్చుకోట నారాయణ రెడ్డి, కల్లూరు నాగరత్నం రెడ్డి, కర్నూలు రమణారెడ్డి. దయానంద రెడ్డి, రేనాటి శివానందరెడ్డి, గొట్లూరు శ్రీనాథ్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, కేవీ శివారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ బాబిరెడ్డి, వాసుదేవ రెడి, పోతిరెడ్డి, కుమ్మెత రాజగోపాల్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రేనాటి వెంకటరామిరెడ్డి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

ఉరవకొండలో తాగునీటి ఎద్దడి

- పయ్యావుల ఇలాకాలో నీటి సమస్య తీవ్రం
- తాగునీటి కోసం అవస్థలు పడుతున్న ప్రజలు



పూర్తిగా అడుగంటిపోయిన నింబగల్లు సీపీడబ్ల్యూ స్కీమ్ ఎస్ఎస్ ట్యాంకు



నిరుపయోగంగా ఉన్న సీపీడబ్ల్యూఎస్ పథకం బోరు

ఉరవకొండ: నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండలో తాగునీటి ఎద్దడి నెలకొంది. పట్టణంలో అనేక కాలనీల్లో తాగునీరు సరఫరా జరగకపోవడంతో ప్రజలు కష్టాలు పడుతున్నారు. నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వంలో ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పయ్యావుల కేశవ్ సొంత నియోజకవర్గంలో కొన్ని నెలల నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉంది. దీంతో ప్రజలు బోర్ల వద్ద నుంచి అతికష్టంతో నీరు తెచ్చుకుంటున్నారు. నీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అడిగితే నింబగల్లు సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ మూడు సమ్మర్ స్టొరేజీ ట్యాంకుల్లో నీరు పూర్తిగా అడుగంటి పోవడంతో పీఏబీఆర్‌లోని శ్రీరామరెడ్డి తాగునీటి తాగునీటి స్కీమ్‌పై ఆధారపడి పంపింగ్ చేస్తున్నామని చెబుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..ప్రజలకు శాపం:

ఉరవకొండతో పాటు మండల పరిధిలోని రేణుమాకుపల్లి, నింబగల్లు, బూదగవి, వెలిగొండ, వ్యాసాపురం, రాయంపల్లి, నెరిమెట్ల గ్రామాలకు నింబగల్లు వద్ద ఉన్న సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా అధికారులు సరైన ప్రణాళికలు లేక పర్యవేక్షణ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఎస్ఎస్ ట్యాంకులోని మూడు ట్యాంకుల్లో నీరు అడుగంటి పోయాయి. దీంతో తాగునీరు నెల రోజులకు ఒకసారి కూడా విడుదల చేయకుండా అధికారులు చెతులేత్తాశారు. ట్యాంకుల్లో నీరు అడుగంటి పోవడంతో నింబగల్లు వద్ద రెండు బోర్లు, ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద రెండు బోర్లు వేశారు. అయితే అవి కొద్ది రోజులకే చెడిపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. కనీసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రజలకు ట్యాంకర్లతోనైనా నీటి సరఫరా చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

బోర్లు మరమ్మతులు చేయిస్తాం

బోర్లు మరమ్మతులు చేసి ఉరవకొండ పట్టణంతో పాటు గ్రామాలకు నీటి సరఫరా చేయిస్తాం. తుంగభద్ర డ్యాం నిండి హెచ్చెల్సీ కాలువకు నీరు విడుదల అయ్యే వరకూ నీటి సమస్య ఉంటుంది. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఫామీదా, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఉరవకొండ

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలతోపాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరుడి మూలవిరాట్‌కు మాఘ స్నానాలు, ఆకుపూజ చేశారు. మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు చేశారు.